సాక్షి
అనంతపురం

ఆదివారం । 21 । జూలై । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



దిగిరాని టమాట

టమాట ధరలు దిగిరావడం లేదు. అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.56 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.6°/22.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జేసీ కేతన్‌గార్గ్ బదిలీ

- రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్‌గా నియామకం
- అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి కూడా బదిలీ

అనంతపురం అర్బన్: జేసీ కేతన్‌గార్గ్ బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం ఆయనను నియమించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేసీతో పాటు అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవిని కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. మేఘస్వరూప్‌ను మదనపల్లి సబ్ కలెక్టర్‌గా, నిదియాదేవిని రాజంపేట సబ్‌కలెక్టర్‌గా నియమించింది.

జేసీగా రెండేళ్లు పూర్తి

జాయింట్ కలెక్టర్‌గా కేతన్‌గార్గ్ జిల్లాలో రెండేళ్ల ఐదు నెలలు జిల్లాలో విధులు నిర్వర్తించారు. 2022, ఫిబ్రవరి 5వ తేదీన ఆయన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఎక్కడా విమర్శలకు తావివ్వకుండా విధులు నిర్వర్తించారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద పోటు ఆగడం లేదు. శుక్రవారం 1,08,790 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శనివారం ఉదయానికి 1,16,040 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్‌మగళూరు, వరనాడులో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగ నది పోటెత్తుతోంది. ఈ క్రమంలో పరుగులు తీస్తూ నీరంతా టీబీ డ్యాం చేరుతోంది. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే నాలుగు రోజుల్లో జలాశయం పూర్తిగా నిండవచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 65.110 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,621.32 అడుగులకు నీరు చేరింది. ఈ నెల 22 నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు నీరు విడుదల చేయనున్నట్లు ఇప్పటికే టీబీ బోర్డు ప్రకటించిన విషయం తెలిసిందే.

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా కృష్ణయ్య



ప్రొఫెసర్ కృష్ణయ్యకు అభినందనలు తెలియజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. రిజిస్ట్రార్‌గా ఎంపిక చేసిన వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. వర్సిటీ పురోగతికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనకు వర్సిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కాగా, గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకూ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా కృష్ణయ్య పనిచేశారు. ఇటీవల టీడీపీతో కూడిన కూటమి అధికారంలోకి రాగానే రిజిస్ట్రార్‌గా మళ్లీ ఆయననే నియమించడం గమనార్హం.

అన్నదాతకు దిక్కెవరప్పా!

వర్షాలు లేక ఖరీఫ్ కల్లోలంగా మారుతోంది. మునుపెన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ముందస్తుగా తొలకర్లు, నైరుతి ఆశలు రేకెత్తించినా కీలక సమయంలో వరుణుడు పత్తాలేకుండా పోవడంతో అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. ప్రత్యామ్నాయ మార్గం చూపడంలో, సాగుకు సాయం చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండడంతో అన్నదాతలు మరింత ఆందోళన చెందుతున్నారు.



వర్షాలు లేక రాప్తాడు సమీపంలో విత్తుకు నోచుకోని పొలం

- 40 రోజులుగా తీవ్ర వర్షాభావం
- కదలిక లేని ఏరువాక
- మొహం చాటేసిన రుతుపవనాలు
- 3.46 లక్షల హెక్టార్లకు గానూ 80 వేల హెక్టార్లలోనే పంటలు
- ఇక ప్రత్యామ్నాయమే దిక్కు
- ప్రభుత్వం నుంచి సాయం లేక ఆవేదనలో రైతన్న

అనంతపురం అగ్రికల్చర్: రోజూ మేఘాలు ఊరిస్తున్నా నిరాశే మిగులుతోంది. నెల రోజులుగా 25 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న బలమైన గాలులతో వరుణుడు మొహం చాటేస్తున్నాడు. దీంతో ఖరీఫ్ పడకేసింది. 3.46 లక్షల హెక్టార్లకు గానూ కేవలం 80 వేల హెక్టార్లలోనే పంటలు సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. కేవలం 25 శాతం విస్తీర్ణానికే పంటలు పరిమితం కాగా, వేరుశనగ, కంది, ఆముదం, పత్తి తదితర ప్రధాన పంటల సాగుకు శనివారం (ఈనెల 20)తోనే అదును ముగిసింది. పంటలు విత్తుకునేందుకు రైతులకు ఎంతో అనుకూలమైన ఆరుద్ర, పునర్వసు కార్తెలు ముగియడంతో ఇక ముందు విత్తినా పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమంటున్నారు.

మురిపించిన జూన్..

జూన్ 2న 'నైరుతి' రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో జూన్ మొదటి 15 రోజులు వర్షాలతో మురిపించడంతో రైతులు సంతోషంగా ఖరీఫ్ సేద్యానికి దిగారు. జూన్ 14 వరకు ఏకంగా 11 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కాగా, ఆ తర్వాత నెల రోజులకు పైగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యలో ఒక వర్షపు రోజు కూడా నమోదు కాలేదు. జూలై 16న మాత్రం 2.6 మి.మీ సగటు వర్షపాతం నమోదై వర్షపు రోజులు 12 రోజులకు చేరుకున్నాయి.

కేవలం 17.2 మి.మీ వర్షపాతమే..

40 రోజుల పాటు వర్షాలు లేక ఖరీఫ్ మందకొడిగా సాగింది. 'నైరుతి' మొహం చాటేయగా.. అల్పపీడనాలు, తుపాన్లు కూడా ప్రభావం చూపని కారణంగా ఖరీఫ్ కష్టంగా మారింది. జూన్‌లో 61 మి.మీ గానూ 142.1 శాతం అధికంగా 147.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక కీలకమైన జూలైలో 63.9 మి.మీ గానూ 60 శాతం తక్కువగా కేవలం 17.2 మి.మీ నమోదు కావడంతో ఖరీఫ్ పడకేసింది. గుత్తి, గుంతకల్లు, విడపనకల్లు మినహా మిగతా 28 మండలాల్లో తీవ్ర వర్షాభావం, సుదీర్ఘ వర్షపాత విరామాలు (డ్రైస్పెల్స్) నమోదయ్యాయి.

80 వేల హెక్టార్లకే పరిమితం..

వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం జిల్లావ్యాప్తంగా 3.46 లక్షల హెక్టార్లకు గానూ ప్రస్తుతానికి 80 వేల హెక్టార్లకే ఖరీఫ్ సాగు పరిమితమైంది. అందులో ప్రధానపంట వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లకు గానూ 28 వేల హెక్టార్లు, కంది 38 వేల హెక్టార్లకు గానూ 14 వేల హెక్టార్లు, పత్తి 48 వేల హెక్టార్లకు గానూ 13 వేల హెక్టార్లు, ఆముదం 17 వేల హెక్టార్లకు గానూ 4 వేల హెక్టార్లు, మొక్కజొన్న 12 వేల హెక్టార్లకు గానూ 3 వేల హెక్టార్లలో సాగులోకి వచ్చాయి. వీటితో పాటు సజ్జ, రాగి, జొన్న, పెసర, అలసంద, మినుము, కొర్ర, పొద్దుతిరుగుడు తదితర పంటలు మరికొంత విస్తీర్ణంలో వేశారు. మొత్తమ్మీద చూస్తే... ఖరీఫ్ 25 శాతానికి పరిమితం కాగా ఇంకా 75 శాతం విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంట వేయాల్సిన పరిస్థితి. ఇదే క్రమంలో చంద్రబాబు ప్రభుత్వం అటు ప్రత్యామ్నాయ మార్గం, ఇటు భరోసా, బీమా కింద పరిహారం రూపంలో సాయం ప్రకటించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఈ ఏడాది ఉచిత బీమానా లేదా ప్రీమియమా అనేది కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో నష్టపోయే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తన ప్రణాళిక తయారు చేయడంలో వ్యవసాయశాఖ కూడా ఇంకా దృష్టి సారించినట్లు కనబడటం లేదు.

విత్తనాలు అమ్ముకోవాల్సిందే



మొదట్లో వర్షాలు బాగా పడ్డాయి. దీంతో 5 ఎకరాల్లో వేరుశనగ వేద్దామని రూ.22 వేలు పెట్టి సబ్సిడీ విత్తనం సమకూర్చుకున్నా. తీరా అదను వచ్చాక వరుణుడు మొహం చాటేయడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. విత్తుకునేందుకు సమయం మీరిపోతోంది. రెండు మూడు రోజులు చూసి విత్తనాలు అమ్ముకోవాలి. నెల రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

– వెంకటేష్, రైతు, కలగల్ల గ్రామం, కూడేరు మండలం

ఎలా బతకాలో అర్థం కావడం లేదు



10 ఎకరాల్లో వర్షాధారంగా వేరుశనగ వేయాలని ముందస్తుగానే దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్నా. ట్రాక్టర్ల ద్వారా సేద్యానికి రూ.30 వేలు ఖర్చు చేశా. అలాగే వేరుశనగ విత్తనాల కోసం రూ.72 వేల వ్యయమైంది. ఇప్పటికే రూ.లక్షకు పైగా ఖర్చు చేసి విత్తనం వేసేందుకు నెలన్నర రోజులుగా ఎదురుచూస్తున్నా వర్షం పడలేదు. ఇలా అయితే రైతులు ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

– మల్లికార్జున, రైతు, మల్లాపురం, కళ్యాణదుర్గం మండలం

సొంత రెవెన్యూ డివిజన్‌లో నో పోస్టింగ్

- తహసీల్దార్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

అనంతపురం అర్బన్: తహసీల్దార్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జోన్-4 పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని 248 మంది తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులను సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) శనివారం జారీ చేశారు. తహసీల్దార్లను రిలీవ్ చేయాలంటూ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సొంత జిల్లాకు తిరిగి వచ్చిన తహసీల్దార్లకు సొంత రెవెన్యూ డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వకూడదని పేర్కొన్నారు. జిల్లా నుంచి 39 మంది తహసీల్దార్లు, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 23 మంది తహసీల్దార్లు మొత్తం 62 మంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. వీరంతా ఒకట్రెండు రోజుల్లో ఆయా జిల్లాలకు చేరుకుని కలెక్టర్ వద్ద రిపోర్ట్ చేసుకుంటారు. ఆ తరువాత కలెక్టర్ వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

గోవా మద్యం పట్టివేత



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

శింగనమల: గోవా నుంచి పెద్దపప్పూరు మండలానికి తీసుకెళ్తున్న 960 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ఉల్లికల్లు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నె గ్రామానికి చెందిన నల్లని శివప్రసాద్ టాటా ఇండికా కారును పరిశీలించారు. ఈ క్రమంలోనే గోవా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. 576 బాటిళ్ల గోల్డ్ విస్కీ, 48 బాటిళ్ల ఆఫ్ ఓ చాయ్స్ విస్కీ, 240 బాటిళ్ల రిలీ హనీ బ్రాందీ, 48 బాటిళ్ల మాన్సన్ హౌస్, 48 బాటిళ్ల హైవార్డ్స్ విస్కీ ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఊపిరి ఉన్నంత వరకూ తాడిపత్రిలోనే

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం/తాడిపత్రి టౌన్: ఊపిరి ఉన్నంత వరకూ తాడిపత్రిలోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. జిల్లా నూతన ఎస్పీ మురళీకృష్ణను శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ తాడిపత్రి అల్లర్ల కేసులో తనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి జామీన్లు వేయడానికి ఈ నెల 15 నుంచి తాడిపత్రి పోలీసులను సంప్రదిస్తున్నా స్పందన లేదన్నారు. పోలీసు అధికారులు హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తు న్నారన్నారు. ఈ రోజు, రేపు అంటూ కాలయాపన చేస్తూ తనను తాడిపత్రికి పోనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. తనతో పాటు మరో 11 మందికి బెయిల్ రాగా, అందరూ జామీను ఇచ్చారన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

జేసీ ప్రభాకర్ రెడ్డి, అతని కుమారుడికి కూడా షరతులతో కూడిన బెయిల్ వచ్చిందన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి తనను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు. తాడిపత్రిలోకి అడుగుపెడితే పంచె ఊడగొట్టి కొడతా, జిల్లా బహిష్కరణకు గురిచేస్తా అని ప్రగల్భాలు పలికాడన్నారు. తాడిపత్రి ఏమైనా జేసీ కుటుంబం జాగీరా అని ప్రశ్నించారు. తాడిపత్రిలో 87 వేల మంది తమకు ఓటు వేశారని గుర్తు చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి బీఎస్–3,4 వాహనాల అంశంలో తాను కేసు పెట్టలేదని, అధికారులే ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటికే తనను, తన కుమారుడిని, ఆర్టీఏ అధికారులను దూషించారన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు తాడిపత్రిలోనే ఉంటానని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందిస్తానని స్పష్టం చేశారు. గతంలో తన సోదరుడిని హత్య చేయించారని, ఫ్యాక్షన్ వద్దనుకుని తామంతా మౌనంగా ఉన్నా రెచ్చగొడుతున్నారన్నారు. చేతనైతే తాడిపత్రిని ప్రశాంతంగా ఉంచాలని హితవు పలికారు. ఇప్పటి వరకూ తాను అధికారులు చెప్పినట్లే విన్నానన్నారు. తాడిపత్రిలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని, పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు జామీన్లు అందజేసేందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, పోలీసులు తిరిగి అనంతపురంలోని స్వగృహానికి తరలించారు. అక్కడే ఆయనతో జామీను పత్రాలను సీఐ నాగేంద్ర ప్రసాద్ స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, నరసింహారెడ్డి, తేజారెడ్డి, వేణు, హనుమంతరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మీరంగయ్య తదితరులు ఉన్నారు.

అరకొరగా పనులు చేస్తే ఎలా?

- డీఆర్‌ఎం విజయకుమార్ అసహనం
- అనంతపురం రైల్వేస్టేషన్ తనిఖీ

అనంతపురం సిటీ: అరకొరగా పనులు చేస్తే ఎలా అంటూ డీఆర్‌ఎం విజయకుమార్ అసహనం వ్యక్తం చేశారు. అనంతపురం రైల్వేస్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ విస్తరణలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఒకటో ప్లాట్‌ఫాంపై అరకొరగా పనులు చేసి వదిలేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులు చేపట్టిన 'రైట్స్' సంస్థ ప్రతినిధులపై మండిపడ్డారు. ప్రతి చోటా సగం సగం పనులు చేసి చేతులు దులుపుకోవడం ఏంటని నిలదీశారు. వెంటనే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన డిజైన్‌లో అనంతపురానికి సంబంధించి రూపొందించిన లోగోపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాంత విశిష్టతను తెలిపేలా, కీర్తిని చాటేలా లోగో ఉండాలని పేర్కొన్నారు. హైమాస్ లైట్ల స్తంభాన్ని మార్చే సమయంలో చీకటి లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జనరల్ వెయిటింగ్ హాలులో దివ్యాంగుల కోసం నిర్మించిన మరుగుదొడ్లలోకి వీల్‌చైర్ ద్వారా వెళ్లే అవకాశమే లేదని, ఇందుకు అడ్డొస్తున్న ఫ్రేం తొలగించాలని ఆదేశించారు. లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలన్నారు. క్యాంటీన్ కోసం కేటాయించిన స్థలాన్ని డీఆర్‌ఎం పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీఓఎం శ్రవణ్, డివిజనల్ ఇంజినీర్(వెస్ట్) మణికంఠ, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఎస్‌ఓ సూర్యనారాయణ, డీఈ టీఆర్‌ఎస్‌ఓ వీరయ్య, స్థానిక స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఫజల్ అహమ్మద్, జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్, ఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జ్ సీఐ కుమార్, ఎస్‌ఐ మధుకర చారి, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

ప్రాణాలు 'తోడేస్తున్న' ఇసుకాసురులు

- వేదావతి హగరి నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- ఉచితం ముసుగులో సహజ సంపద దోపిడీ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు
- ఇసుకాసురుల నిర్లక్ష్యానికి ముక్కుపచ్చలారని చిన్నారుల బలి
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

రాయదుర్గం: నియోజకవర్గంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. వేదావతి హగరి నదిలో యథేచ్ఛగా తవ్వకాలకు పాల్పడుతూ సహజ సంపదను బొక్కేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ముసుగులో టీడీపీ నాయకులు దోపిడీ పర్వానికి తెరతీశారు. రాయదుర్గం మండలం జుంజురాంపల్లి వద్ద ఏర్పాటు చేసిన అధికారిక రీచ్‌లో కాకుండా వేదావతి హగరిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. సరిహద్దుల్లో డంపులు పేర్చి డబ్బులు చేసుకుంటున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోజుకు 500 ట్రిప్పులు

రాయదుర్గం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దున ఉంది. ఈ ప్రాంతంలో లభించే ఇసుకకు కర్ణాటకలో డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో కొందరు ఇసుక వ్యాపారం ఎంపిక చేసుకున్నారు. నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలంలో భూపసముద్రం, రంగచేడు, కలుగోడు,గుమ్మఘట్ట,బీటీపీ, కణేకల్లు మండలంలోని కళేకుర్తి, నాగేపల్లి, మాల్యం, బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, బండూరు, కళ్లదేవనహళ్లి, బొల్లనగుడ్డం, డి హీరేహాళ్ మండలంలో బాదనహాళ్, నాగలాపురం, హొసగుడ్డం బ్రిడ్జి, మల్లికేతి, డీ హీరేహాళ్ చెరువుల నుంచి నిత్యం 500 ట్రిప్పులకుపైగా ఇసుక తరలిస్తున్నారు. తవ్విన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని కంకర క్వారీల్లో నిల్వ చేసి రాత్రికి రాత్రి లారీల్లో కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు.



ఉద్దేహాళ్ వద్ద హగరిలో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

ర్యాష్ డ్రైవింగ్‌తో హడల్

అక్రమం కావడంతో ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తున్నారు. అతివేగంతో ట్రాక్టర్లు నడుపుతుండడంతో పాటు లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకుని కన్నూమిన్నూ కానకుండా వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనదారులు హారన్ కొడుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.



ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయిన అరుణ్‌తేజ్, స్పందన (ఫైల్)

ముక్కుపచ్చలారని చిన్నారుల మరణం

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో తాజాగా గుమ్మఘట్ట మండలం ఎస్. హొసహళ్లి (కొత్తపల్లి)కి చెందిన ముక్కుపచ్చలారని చిన్నారులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. గ్రామానికి చెందిన మల్లికార్జున, మల్లేశ్ అన్నదమ్ములు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మల్లికార్జున, వాణి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, మల్లేశ్, లేపాక్షమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మల్లికార్జున కుమారుడు అరుణ్‌తేజ్ మూడో తరగతి, మల్లేశ్ కుమార్తె స్పందన ఐదో తరగతి రాయదుర్గం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. మేనమామ సురేశ్ శనివారం అరుణ్‌తేజ్, స్పందనను తీసుకుని ద్విచక్రవాహనంపై రాయదుర్గానికి బయలు దేరిన కొద్దిసేపటికే ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్పందన, అరుణ్‌తేజ్‌ను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా, మార్గమధ్యంలో చనిపోయారు. సురేశ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. వీరిని ఢీకొన్న ట్రాక్టర్ రాయదుర్గం పట్టణానికి చెందిన టీడీపీ వర్గీయుడు ముల్లంగడ్ల రామాంజినేయులుది కావడం గమనార్హం. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పిల్లలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

పట్టించుకోని అధికారులు

కూటమి ప్రభుత్వం వచ్చాక రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఇసుక దందా ఎక్కువైంది. ముఖ్యంగా వేదావతి హగరి నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అంతా తెలిసినా.. పోలీసులు, సెబ్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత, డీఎస్పీ బీ శ్రీనివాసులు, ఆర్టీఓ విశ్వనాథ్‌రెడ్డిని సంప్రదించగా... అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లౌడ్ స్పీకర్లతో రోడ్డెక్కే ట్రాక్టర్లు సీజ్ చేస్తామన్నారు. చిన్నారుల మృతి బాధాకరమని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

అమెరికా వెళ్లేలోపే కానరాని లోకాలకు..



దెబ్బతిన్న కారు ముందుభాగం



మృతి చెందిన సాయి జశ్వంత్‌రెడ్డి

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- మరో నలుగురికి గాయాలు

అనంతపురం: అమెరికా వెళ్లాలని ఆ యువకుడు కన్న కలలు కల్లలయ్యాయి. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు అతడిని చిదిమేసింది. కరెంటు స్తంభాన్ని కారు ఢీకొనడంతో యువకుడు దుర్మరణం పాలైన ఘటన అనంతపురం రుద్రంపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. ట్రాఫిక్ సీఐ నారాయణ రెడ్డి తెలిపిన మేరకు.. నగరంలోని నీరుగంటివీధిలో నివాసం ఉంటున్న ప్రేమనాథ రెడ్డికి సాయి జశ్వంత్ రెడ్డి (22)ఒకడే కుమారుడు. జశ్వంత్ రెడ్డి ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు. ఎంఎస్ చదవడానికి వచ్చే నెల అమెరికాకు వెళ్లాల్సి ఉంది. ఇప్పటికే అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి స్నేహితులతో కలిసి టీ తాగేందుకు కారులో జశ్వంత్ రెడ్డి బయలుదేరాడు. జాతీయ రహదారిపై తపోవనం నుంచి రాప్తాడు వైపు వెళ్తుండగా, పిస్తా హౌస్ సమీపంలో కారు అదుపుతప్పింది. కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. ఈ క్రమంలో కారులో ఉన్న సాయి జశ్వంత్ రెడ్డి ఎగిరి కింద పడ్డారు. తీవ్రగాయాల పాలై ఘటనాస్థలిలోనే ప్రాణాలు వదిలాడు. ఇతనితో పాటు కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే జశ్వంత్ రెడ్డి తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు. మరికొన్ని రోజుల్లో ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లాల్సిన తరుణంలో ఇలా జరిగిందంటూ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



చేప పిల్లలను వదులుతున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం బుక్కరాయసముద్రంలోని డ్రెయినేజీల్లో దోమల నివారణ కోసం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ రానున్న వర్షాలకు గ్రామాల్లో ఎక్కడా మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. మురికి నీరు నిల్వ ఉంటే అందులో దోమలు గుడ్లు పెట్టి సంతతి పెంచుతాయన్నారు. మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి సచివాలయాలకు గంబూషియా చేపలను సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెహరున్నీసా, సీహెచ్ఓ మోహన్‌రావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, శ్రీధర్‌మూర్తి, పీహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మి, ఫాతిమా, ఈశ్వరమ్మ, సత్యనారాయణమూర్తి, ధనుంజయ, ఆనంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అర్చకుల సమావేశం

అనంతపురం కల్చరల్: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అర్చకుల సమావేశం సోమవారం అనంతపురం మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో జరుగనుంది. ఈ మేరకు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో జరిగే సమావేశానికి రెండు జిల్లాల దేవదాయశాఖ అధికారులు వస్తారని, అర్చకులందరూ విచ్చేసి తమ సమస్యలను ప్రస్తావించాలని కోరారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: అనంతపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, పోలీస్ కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల కోసం ప్రిపేరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శిక్షణ ఉంటుందని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 92902 00675 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

22 నుంచి 'శిక్షా సప్తాహ్'

- వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి కార్యాచరణ
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్ర శిక్ష
- ఎన్‌ఈపీ ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలు
- స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శెట్టూరు కేజీబీవీలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఎస్ఓ లలిత, తదితరులు

తాడిపత్రి రూరల్: ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 తేదీ వరకు శిక్షా సప్తాహ్ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీ చేశారు. వేడుకలను విజయవంతం చేయడానికి స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులను అధిక సంఖ్యలో భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 3,600 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 1,582 పాఠశాలలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2,018 పాఠశాలలు ఉన్నాయి. 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ నూతన విద్యా విధానం నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆయా పాఠశాలల్లో వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాచరణను రూపొందించింది.

డాక్టర్ కస్తూరిరంగన్ సిఫారసుల మేరకు ఎన్‌ఈపీ

దేశంలో కొత్తగా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్న దానిపై డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఎన్‌ఈపీ-2020ని ప్రవేశ పెట్టారు. అప్పటి వరకూ ఉన్న 10+2+3 విద్యావిధానాన్ని రద్దు చేసి 5+3+3+4 విద్యా విధానాన్ని అమలు చేశారు. కొత్త విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శిక్షా సప్తాహ్ వేడుకలను వారం రోజుల పాటు జరపనున్నారు. వేడుకలను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలని విద్యాశాఖ నుంచి ఎంఈఓలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రతి పాఠశాలలో వేడుకలు తప్పనిసరి



శిక్ష సప్తాహ్ వేడుకలను ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలి. రాష్ట్ర సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు వారం రోజుల పాటు చేయాల్సిన కార్యక్రమాల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశాం. వాటిని అనుసరించి కార్యక్రమాలు చేపట్టాలి.

–నాగరాజు, ఎంఈఓ, తాడిపత్రి

వారం రోజుల పాటు జరిగే వేడుకలు ఇవే...

ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జరిగే శిక్ష సప్తాహ్ వేడుకలను నిర్వహించడంలో భాగంగా ఏ రోజు ఏ కార్యక్రమం చేపట్టాలనే అంశంపై విద్యాశాఖ వివరాలను అందచేసింది.

- 22న స్థానికంగా లభించే వనరులను ఆసరాగా చేసుకుని అభ్యస సామగ్రిని తయారు చేయడం. తయారు చేసిన సామగ్రిని పరిశీలించడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలను ఆహ్వానించి వారి ప్రశంసలు పొందడం.
- 23న పునాది అభ్యసన కార్యక్రమంలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై విద్యార్థులు మంచి నైపుణ్యం సాధించేలా చేయడం. గణితంలోని సంఖ్యా శాస్త్రంపై పట్టు సాధించేందుకు చర్చల ద్వారా అవగాహన కల్పించడం.
- 24న వివిధ క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం. పోటీల ద్వారా వారిలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను వివరించడం.
- 25న భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థుల్లో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం. ప్రధానంగా క్లాసికల్, ఫ్యాన్సీ డ్రస్‌లు, నృత్య ప్రదర్శన, పాటల పోటీలు, నాటిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం.
- 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా విద్యలో సాంకేతికాభివృద్ధిని గుర్తించేలా చర్చలు జరపడం. ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల సౌకర్యాలు మెరుగు పరుచుకుని డిజిటల్ విద్య కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాలను గుర్తించడం.
- 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మిషన్ లైఫ్ యాక్టివిటీస్, న్యూట్రిషన్ డే, కొత్తగా ఏకో క్లబ్‌ల ఏర్పాటు, అమ్మకు అంకితం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లులతో కలసి మొక్కలు నాటడం, మాతృభూమి మధ్య బంధం పెంచడానికి ప్రతి పాఠశాలలో తల్లీబిడ్డలతో కలసి 35 మొక్కలు నాటడం.
- 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా చివరి రోజు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి కమిటీలను ఏర్పాటు చేయడం. ఉపాధ్యాయ సంఘాల సహకారంతో వివిధ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం.

జర్నలిస్ట్ హెల్త్‌స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది ఎమ్మెల్యేల సహకారంతో జర్నలిస్టుల ప్రీమియం మొత్తాన్ని చెల్లించనున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులు అక్రిడేషన్, ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలతో ఈ నెల 25లోగా అందజేయాలని సూచించారు. అనంతపురం నియోజకవర్గం జర్నలిస్టులు విశాలాంధ్ర రిపోర్టర్ మల్లికార్జున శర్మ (99480 56820), ప్రజాతేజం ఎడిటర్ చౌడప్ప (94906 25527), కళ్యాణదుర్గం నియోజకవర్గం వారు టీవీ5 రిపోర్టర్ రవి (70133 27482), తాడిపత్రి నియోజకవర్గం వారు కంబగిరి (98494 21641), రాయదుర్గం నియోజకవర్గం వారు కమాలక్షుడు (82070 56865)ను సంప్రదించాలన్నారు.

బసవేశ్వరుని ధర్మాన్ని పాటిద్దాం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఉత్తరాధికారి

ఉరవకొండ: బసవేశ్వరుని ధర్మాన్ని అందరూ పాటించాలని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గవిమఠ సంస్థానంలో వీరశైవ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో వీరశైవ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గవిమఠం ఉత్తరాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ మతాలను ఏకం చేయాలని, కుల, మత భేదాలు ఉండకూడదని, అందరూ సమానమే అని బసవేశ్వరుడు చాటాడన్నారు. వీరశైవ మతాన్ని మరింత అభివృద్ధి చేయాలని, భక్తి భావాలను పెంపొందించాలని, సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వీరశైవ నాయకులు పాటిల్ నిరంజన్‌గౌడ్, మల్లికార్జున (చంద్రిక మెడికల్ స్టోర్) డి.గంగాధర, జయరామిరెడ్డి, శంకర్‌గౌడ్, చంద్రమౌళి, మఠం యోగేశ్వరస్వామి, దేశాయి వీరేష్, నాగన్న, బొజ్జప్ప, బండే గౌడ్, వీరేష్, బసవరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- ప్రేమికురాలితో పెళ్లి కాలేదని అఘాయిత్యం

బొమ్మనహాళ్: తనను ప్రేమించిన అమ్మాయి.. తల్లిదండ్రుల ఒత్తిడితో మరొకరిని వివాహమాడేందుకు సిద్ధపడటాన్ని భరించలేకపోయిన యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. శెట్టూరుకు చెందిన మనోజ్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కళ్యాణదుర్గంలో డిగ్రీ చదివే సమయంలో బొమ్మనహాళ్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇటీవల వీరి ప్రేమ విషయం తెలిసి మనోజ్‌రెడ్డిని అమ్మాయి తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలోనే అమ్మాయికి మరొకరితో వివాహం కుదుర్చుకున్నారు. తను ప్రేమించిన అమ్మాయి శాశ్వతంగా దూరం అవబోతోందని తెలుసుకున్న మనోజ్‌రెడ్డి శనివారం అమ్మాయి ఇంటికి వెళ్లాడు. తాము ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకుంటామని, తమకు పెళ్లి చేయండని ప్రాధేయపడగా అమ్మాయి తల్లిదండ్రులు తిరస్కరించారు. తమ కూతురుకు మంచి సంబంధం కుదిరిందని, అడ్డు రావొద్దని, ఇక్కడి నుంచి తక్షణమే వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. దీంతో మనస్తాపం చెందిన మనోజ్‌రెడ్డి ఆ ఇంటి సమీపంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. బొమ్మనహాళ్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మనోజ్‌రెడ్డిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక పురోగతి

- మొదటి విడతగా సాగు కోసం ఆరు మండలాల ఎంపిక



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్

ఉరవకొండ: మార్కెట్లో నిరంతరం డిమాండ్ ఉండే ఆయిల్ పామ్ సాగుతో రైతులు సుస్థిరమైన నికర ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. శనివారం రాకెట్ల రైతు సేవా కేంద్రంలో ఆయిల్ పామ్ సాగుపై ఉద్యాన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా ఆయిల్ పామ్ సాగుకు ఆరు మండలాల (బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, ఉరవకొండ, వజ్రకరూరు, కణేకల్లు, కూడేరు)ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా మండలాల్లో రైతులు సాగుచేసే విధంగా అవగాహన కల్పించేందుకు పలు కంపెనీలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2.27 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. ఆయిల్ గెలల ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుందన్నారు. మొక్కలు నాటిన మూడు సంవత్సరాల తరువాత అంతరపంటగా వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి నెట్టికంఠ, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

బడికెళ్లమంటే తిరుపతికెళ్లాడు!

- కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు
- రెండురోజుల తర్వాత తల్లిదండ్రుల చెంతకు



తిరుపతిలో తెలంగాణకు చెందిన దంపతులతో నిఖిలేశ్వరరెడ్డి (ఎర్ర షర్ట్)

గుత్తి రూరల్: బడికని ఇంటి నుంచి గుత్తికి బయల్దేరిన బాలుడు రైలుబండి ఎక్కి తిరుపతి చేరుకున్నాడు. అక్కడ తెలంగాణ రాష్ట్రానికి చెందిన దంపతులు గమనించి అతడిని తమవెంట తిరుమలకు తీసుకెళ్లి శ్రీవారి దర్శనం చేయించారు. సెల్ఫీ దిగి ఫొటో అప్‌లోడ్ కోసం ఇన్‌స్టా ఐడీ ద్వారా బాలుడి తల్లిదండ్రుల నంబర్ కనుక్కొని సమాచారం ఇవ్వడంతో రెండు రోజుల తల్లిదండ్రుల నిరీక్షణకు తెరపడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన లావణ్య, కాంతారెడ్డి దంపతుల కుమారుడు సాయి నిఖిలేశ్వర రెడ్డి గుత్తి శివార్లలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18న ఉదయం గ్రామం నుంచి ఆటోలో పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇంట్లో గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నిఖిలేశ్వరరెడ్డి పాఠశాలకు వెళ్లకుండా తిరుపతికి చేరుకున్నాడు. ఈ నెల 19న ఉదయం తిరుపతి స్టేషన్‌లో నిఖిలేశ్వర్‌రెడ్డి ఒంటరిగా కూర్చుని ఉండగా తెలంగాణ రాష్ట్రం జనగామ పట్టణానికి చెందిన కవిత, అజయ్ దంపతులు గమనించారు. నిఖిలేశ్వర్‌రెడ్డితో మాటలు కలిపి ఎక్కడ నుంచి వచ్చావు, ఎందుకు ఒంటరిగా ఉన్నావు, తల్లిదండ్రులు ఎక్కడున్నారు అని ఆరా తీయగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో దంపతులకు అనుమానం వచ్చి.. బాలుడిని తమ వెంట తిరుమలకు తీసుకెళ్లారు. అనంతరం తిరిగి కొండ నుంచి కిందకు దిగుతూ ఆ జంట బస్సులో నిఖిలేశ్వర్‌రెడ్డితో సెల్ఫీ దిగారు. అనంతరం తెలివిగా 'నీ ఇన్‌స్టాగామ్ ఐడీ చెప్పు అందులో ఫొటో అప్‌లోడ్ చేద్దాం' అని కనుక్కున్నారు. ఇన్‌స్టాలో నిఖిలేశ్వర్‌రెడ్డి తండ్రి ఫోన్ నంబర్‌ను గుర్తించారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తండ్రి కాంతారెడ్డి పోలీసులకు సమాచారం అందించి తిరుపతికి వెళ్లి కవిత, అజయ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపి నిఖిలేశ్వర్‌రెడ్డిని గ్రామానికి తీసుకొచ్చారు. అదృశ్యమైన తమ బాలుడు తిరుపతిలో దొరకడంతో తల్లిదండ్రులు ఆనందంలో తేలిపోయారు. అయితే బాలుడు తిరుపతికి ఎందుకెళ్లాడో సరైన సమాధానం చెప్పలేదు.

కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కావాలి

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఏపీలో అరాచకపాలన, టీడీపీ గూండాల విధ్వంసకాండకు నిరసనగా ఈ నెల 24న ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టనున్న ధర్నాతో కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శనివారం ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దురాగతాల గురించి రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రం హోం మంత్రి దృష్టికి వైఎస్ జగన్ తీసుకెళ్తారన్నారు. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే హత్యలు, వేల సంఖ్యలో దౌర్జన్యాలు, దాడులు జరిగాయన్నారు. వీటిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరుండి ప్రోత్సహించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తమపై దాడులు జరిగాయని ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపైనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అటకెక్కించి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ శ్రేణుల దౌర్జన్యాలు, దాడులను అడ్డుకునేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ నరసింహులు, విడపనకల్లు జెడ్పీటీసీ హనుమంతు, నాయకులు భీమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు పాల్గొన్నారు.

కరువు రైతులను ఆదుకోవాలి

ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా 25 శాతం భూముల్లో కూడా విత్తనం పడలేదని, కరువు రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేరుశనగ సాగుకు సమయం దాటిపోయినా ప్రభుత్వం కందులు, ఆముదం లాంటి ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులకు అందించలేదన్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి ప్రకటించిన కరువు మండలాల పరిధిలోని రైతులకు పంటల బీమా, పరిహారం మంజూరు చేయాలని కోరారు.

జీతమో...రామచంద్రా!

- 16న బడ్జెట్ విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లా కార్యాలయం గేటు దాటని జీతాలు
- జీతాల కోసం అల్లాడిపోతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



అనంతపురం ఎడ్యుకేషన్: దేవుడు వరమచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాల పరిస్థితి. ఈ నెల 16న ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు జీతాలకు సంబంధించిన బడ్జెట్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు రూ. 13.03 కోట్లు కేటాయించింది. అనంతపురం జిల్లాకు రూ.6.57 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.6.46 కోట్లు విడుదల చేశారు. ఉద్యోగుల జీతాల క్లెయిమ్స్, ఇతరత్రా బిల్లులు అప్పటికే అన్నీ సిద్ధం చేసి సమగ్రశిక్ష జిల్లా కార్యాలయాలకు పంపారు. కానీ జీతాలు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల్లో బడ్జెట్ విడుదలైన రెండు రోజుల్లోనే జీతాలు జమ చేశారు. కానీ మన రెండు జిల్లాల్లో అధికారుల వైఫల్యం కారణంగా ఉద్యోగుల జీతాలు జమ కాలేదు. రెండు జిల్లాలోని సమగ్ర శిక్ష కార్యాలయాల్లోని రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మే, జూన్ నెలల జీతాలు రాక అల్లాడిపోతున్నారు. కుటుంబాల నిర్వహణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష విభాగంలో 2,800 మంది దాకా పని చేస్తున్నారు. వీరిలో కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు, కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మన్లు, కుక్‌లు, ఏఎన్ఎంలు, ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, ఫిజియో థెరపిస్టులు, ఆయాలు, జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సైట్ ఇంజినీర్లు, టీఎల్ఎంటీలు ఉన్నారు. విద్యాసీజన్ కావడంతో చాలామంది ఉద్యోగులు పిల్లల చదువుల ఫీజులు, పుస్తకాలు, ఇతర వాటి కోసం అల్లాడిపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బడ్జెట్ విడుదలైనా తమకు జీతాలు జమ చేయలేదని ఉద్యోగులు వాపోతున్నారు.

అక్రమాలకు ప్లానింగ్

- టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం
- నగరంలో ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు
- ఆలస్యంగా స్పందిస్తున్న వైనం
- 200లకు పైగా భవనాలపై చార్జ్‌షీట్లు
- జరిమానా రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల పైమాటే



రెండో రోడ్డులో అదనపు ఫ్లోర్‌ను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది (ఫైల్)



రహమత్‌నగర్‌లో పిల్లర్‌ను తొలగిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నగరంలోని ప్రధాన రోడ్లకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నిర్మాణదారులు కనీస ప్రమాణాలు పాటించకున్నా.. వాటిని నియంత్రించడంలో చేతులెత్తేశారు. లోపాయికార ఒప్పందాలతో అతిక్రమణలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నగరంలో 200 భవనాలపై చార్జ్‌షీట్లు దాఖలు చేశారంటే ఏ స్థాయిలో భవనాల అతిక్రమణలు జరిగాయో చెప్పాల్సిన పని లేదు. నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే నిర్మాణాలు జరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

డీల్ కుదరని భవనాలపై చర్యలు

నగరపాలక సంస్థ అనుమతులు తీసుకుని నిర్మాణం చేపడుతున్నా.. ఆ నిర్మాణం ప్లాన్ ప్రకారం నిర్మిస్తున్నారా లేదా అని చూడాల్సిన ప్లానింగ్ కార్యదర్శి, సంబంధిత బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ చేష్టలుడిగి చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లోర్‌పై ఫ్లోర్ వెలుస్తున్నాయి. ఇటీవల రెండో రోడ్డులో జీ ప్లస్ 1కు అనుమతులు తీసుకుని మరో ఫ్లోర్ అదనంగా ఏర్పాటు చేశారు. అదే విధంగా రహమత్ నగర్‌లోనూ జీ ప్లస్ 1 భవనానికి అనుమతి తీసుకుని మరో ఫ్లోర్‌ను అదనంగా కట్టారు. వీటిపై నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. సాయినగర్, హౌసింగ్ బోర్డు, రాంనగర్, సుభాష్ రోడ్డు, కోర్టు రోడ్డు, కమలానగర్, రాజు రోడ్డు, ఆదిమూర్తి నగర్, తదితర ప్రాంతాల్లో నిర్మాణ దశలో వందకు పైగా భవనాలు ఉన్నాయి. ఈ భవన నిర్మాణదారులు యథేచ్ఛగా అతిక్రమణలు చేసినా.. అధికారులు అటువైపు తొంగిచూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ప్లానింగ్ కార్యదర్శి నోటీసు సర్వ్ చేసి మిన్నకుండి పోతున్నారు. వాస్తవంగా భవనాలను అతిక్రమించిన వాటిపై రెండు, మూడు నోటీసులు జారీ చేసి చార్జ్‌షీట్, తర్వాత నిర్మాణాలను తొలగించవచ్చు. కానీ అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. నిర్మాణదారులతో డీల్ కుదిరిన భవనాల వైపు నగరపాలక సంస్థ అధికారులు తొంగి చూడడం లేదన్న విమర్శలున్నాయి. ఈ అడ్డగోలు బాగోతంలో నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వసూళ్లపై దృష్టి సారించని అధికారులు

నగరంలోని సుభాష్ రోడ్డు, కమలానగర్, రాం నగర్, హౌసింగ్ బోర్డు, సాయినగర్, విద్యుత్‌నగర్, జీసస్‌నగర్, అరవిందనగర్, ఆదర్శనగర్, వేణుగోపాల్‌నగర్, రెవెన్యూ కాలనీ, విద్యుత్‌శక్తి నగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, తదితర ప్రాంతాల్లో నిర్మించిన 200 భవనాలపై నగరపాలక సంస్థ అధికారులు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. వాస్తవంగా నిర్మాణం జరిగే సమయంలోనే అడ్డుకోవాల్సి ఉంది. కానీ అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. భవన నిర్మాణదారులతో గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు వసూలు చేయడం ఆ తర్వాత చార్జ్‌షీట్ వేయడం పరిపాటిగా మారిపోయిందని సాక్షాత్తు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ కింది స్థాయి సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. ప్రధానంగా చార్జ్‌షీట్ దాఖలు చేసిన భవన నిర్మాణదారుల నుంచి రూ.50 కోట్ల నుంచి రూ.వంద కోట్ల వరకు నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంది. కానీ వాటి వసూళ్లపై కూడా అధికారులు దృష్టిసారించడం లేదు. ఇప్పటికైనా కమిషనర్ మేఘ స్వరూప్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

హోర్డింగ్స్ తీయడం లేదు

నగర పాలక సంస్థ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ తీయకుండా నానాయాగీ చేస్తున్నారు. భవన నిర్మాణ అతిక్రమణలు చేయకూడదని చెబుతున్నా.. వినడం లేదు. ఇక గత్యంతరం లేక చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నాం. తదుపరి చర్యలకు ఆదేశిస్తున్నాం. భవనాల అతిక్రమణ నిర్మాణదారులకు ఎప్పటికైనా సమస్యగానే మారుతుంది. ముందుచూపుతో ఆలోచించి నిర్మాణాలు చేపట్టాలి.

– మారుతీహరి ప్రసాద్ (ఏసీపీ)

క్లుప్తంగా

అక్బర్ హాస్పిటల్‌ను సందర్శించిన ఎన్‌ఏబీహెచ్ బృందం



ఎన్‌ఏబీహెచ్ బృందంతో డాక్టర్ అల్తాఫ్ అక్బర్

అనంతపురం మెడికల్: నగరంలోని ప్రముఖ డాక్టర్ అక్బర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నేషనల్ అక్రిడేషన్ బోర్డు హాస్పిటల్స్ బృందం శుక్రవారం సందర్శించింది. ఆ ఆస్పత్రిలో పాటిస్తున్న సురక్షిత ప్రమాణాలు, తదితర సేవలపై బృందం సభ్యులు డాక్టర్ ప్రతిమ, డాక్టర్ సెంథిల్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ అల్తాఫ్ అక్బర్‌ను వారు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వైకేపీ సీసీకి గాయాలు



గాయపడిన వైకేపీ సీసీ ఆనంద్ కుమార్

చెన్నేకొత్తపల్లి: స్థానిక వైకేపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సీసీ ఆనంద్ కుమార్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఆనంద్ కుమార్ విధులకు హాజరయ్యేందుకు అనంతపురము నుంచి చెన్నేకొత్తపల్లికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. చెన్నేకొత్తపల్లి 44వ నంబర్ జాతీయ రహదారిపై వై జంక్షన్ దాటగానే బస్సు దిగేందుకు డోర్ వద్దకు వచ్చారు. అయితే అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, స్థానికులు సీసీ ఆనంద్ కుమార్‌ను వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురము తరలించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం ఏరియా కో–ఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం అనసూయమ్మ, తోటి సీసీలు, ఇతర సిబ్బంది ఆసుపత్రికి చేరుకున్నారు. సీసీ ఆనంద్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

'పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు'



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అనంతపురం: పూర్వ విద్యార్థులే కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్లు అని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ చదివిన వారు ఉన్నత స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు మీ అనుభవాలు, సలహాలు ఎప్పటికీ ఉండాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలకు బలం అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి, పూర్వ విద్యార్థుల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ కే.హేమచంద్రా రెడ్డి, ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ముష్టికోవెలలో పారిశుధ్య పనులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామంలో శనివారం సర్పంచ్ రామలక్ష్మమ్మ, కార్యదర్శి మురళీమోహన్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో గ్రామంలో పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం జరిగిందన్నారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



ఎస్పీ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: అనంతపురం ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేవీ మురళీకృష్ణను ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని తాజా పరిస్థితులపై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం క్రైం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈనెల 28న జరగనున్న సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సదస్సుకు ఎంపీని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపీకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి వృథా.. మిగిలేను వ్యథ



ఆత్మకూరు: బైపాస్ రోడ్డు నుంచి ఆత్మకూరు లోపలికి వచ్చే సర్కిల్‌లో సత్యసాయి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో తాగునీరు వృథా అవుతోంది. గతంలో బైపాస్ లేకపోవడంతో పాత రోడ్డు పక్కన సత్యసాయి తాగునీటి పైప్‌లైన్ వేశారు. ప్రస్తుతం పైప్‌లైన్ మీదుగా బైపాస్ రోడ్డు వేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పెద్ద పెద్ద వాహనాలు వెళ్లడంతో నడిరోడ్డుపై ఉన్న పైప్‌లైన్ పగిలిపోతోంది. కొద్ది రోజులుగా నీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తోంది. అంతేకాకుండా నడి రోడ్డుపై పైప్‌లైన్ గుంత ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. సత్యసాయి సిబ్బంది ఇప్పటికే సమస్యను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ పైప్‌లైన్ మరమ్మతులు చేయాలంటే హైవే రోడ్డుకు సంబంధించిన అధికారుల అనుమతి తీసుకోవాలి. ఎలాంటి ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రజకనగర్‌లో మురుగు సమస్య పరిష్కారం



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నడిమివంకలో ఓ ప్రైవేట్ వ్యక్తి తన స్థలమంటూ ఈనెల 19న రాత్రికి రాత్రి మట్టిని అడ్డుగా వేశాడు. శుక్రవారం ఉదయం రజకనగర్ రోడ్లపై మురుగు చేరడంతో దుర్వాసనతో పాటు రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం శనివారం రజకనగర్‌లో పర్యటించారు. ఇంజినీరింగ్, పారిశుధ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం వాటిని తొలగించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన స్థలంలో మట్టి వేశానని సదరు వ్యక్తి అధికారులతో వాగ్వాదం చేశాడు. మేయర్ వసీం స్పందించి విషయాన్ని కమిషనర్ మేఘ స్వరూప్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. జేసీబీ ద్వారా మట్టిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. మేయర్, కమిషనర్ స్పందనపై రజకనగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించడం ద్వారా మురుగు సమస్యకు పరిష్కారం దొరికిందని తెలిపారు. వర్షం వస్తే ఇబ్బంది పడేవారని చెప్పారు. మేయర్ వెంట కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్ భూషణ్, ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, ఏసీపీ మారుతీహరి ప్రసాద్, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, డీఈ రవీంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలుగా సెయింట్ డీపాల్, మాంటిస్సోరి



బాయ్స్ విన్నర్ మాంటిస్సోరి జట్టు



గర్ల్స్ విన్నర్ సెయింట్ డీపాల్

అనంతపురం: అనంతపురం, రాప్తాడు మండల స్థాయి పాఠశాలలకు నిర్వహించిన ఆర్డీటీ క్రికెట్ టోర్నీ విజేతలుగా సెయింట్ డీపాల్, మాంటిస్సోరి పాఠశాలలు నిలిచాయి. గర్ల్స్ విన్నర్‌గా సెయింట్ విన్సెంట్ డీపాల్, బాయ్స్ విన్నర్‌గా మాంటిస్సోరి స్కూల్ నిలిచాయి. ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో సెయింట్ డీ పాల్, ఏపీ మోడల్ స్కూల్ రాప్తాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో సెయింట్ డీపాల్ 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మోడల్ స్కూల్ జట్టు కేవలం 44 పరుగులు చేసి ఓటమి చెందింది. 76 పరుగుల తేడాతో సెయింట్ డీపాల్ స్కూల్ జట్టు గెలుపొందింది. మాంటిస్సోరి, ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మాంటిస్సోరి స్కూల్ జట్టు 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ జట్టు 14.4 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌట్ అయింది. 6 పరుగుల తేడాతో మాంటిస్సోరి పాఠశాల జట్టు గెలుపొందింది.

వేడుకగా ఏడు శనివారాల వ్రతం




పూజలు చేస్తున్న అర్చకులు



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు, రామనగర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు ఏకరూప వస్త్రాలతో బారులు తీరి భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. ఆలయ అర్చకుడు హరికిశోర్‌శర్మతో పాటూ ఇతర అర్చక బృందాలు వ్రతాన్ని నియమనిష్టలతో జరిపించారు. అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు తమ ముందు ఉంచుకున్న శ్రీవారి ప్రతిమలకు పసుపు, కుంకుమ, పవిత్ర జలాలు, పుష్పాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ జరిగింది. అంతకు ముందు మూలవిరాట్టుకు సుప్రభాత సేవ, తిరుమంజన, తోమాల సేవ, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

విశాఖపట్నం ఘన విజయం



హర్షిత

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ ఉమెన్ అంతర్ జోనల్ టోర్నీలో భాగంగా శనివారం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం ఘన విజయం సాధించింది. విశాఖపట్నం, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. హర్షిత 68 బంతుల్లో 103 పరుగులు (ఆరు ఫోర్లు) సెంచరీ సాధించి జట్టుకు మంచి స్కోరు అందించింది. మెహర్ 45 బంతుల్లో 60 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ 50 ఓవర్లలో 144 పరుగులు మాత్రమే చేసింది. 153 పరుగుల తేడాతో విశాఖపట్నం ఘన విజయం సాధించింది.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం



సామూహిక అఖండసాయి భజన చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: గురుపౌర్ణమి వేడుకలు చాలా చోట్ల శనివారమే ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మూడవ రోడ్డులో 24 గంటల పాటూ సాగే అఖండసాయి నామసంకీర్తనను ఉదయం ప్రారంభించారు. అలాగే ఇతర బాబా మందిరాలలో ఆదివారం జరుగనున్న గురు పౌర్ణమి సందర్భంగా విశేష పూజోత్సవాలు జరుగుతున్నాయి. స్థానిక వేణుగోపాల నగర్‌లోని బాబా మందిరంలో బంగారు కిరీటం చేయించి పౌర్ణమి నుంచి బాబాకు అలంకరించనున్నారు. అలాగే స్థానిక వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు అలంకార సేవలు, నగరోత్సవాలు, ఏకంగా పది గంటల పాటూ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు జయచంద్రచౌదరి తదితరులు తెలియజేశారు. హెచ్చెల్సీ కాలనీలోని సద్గురు వలీస్వామి ఆశ్రమం, కమలానగర్‌లోని సద్గురు రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమం, శివబాలయోగి ఆశ్రమం తదితర చోట్ల గురుపౌర్ణమి వేడుకలు జరుగనున్నాయి. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఆదర్శ దంపతుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: నవసమాజ నిర్మాణంలో భాగంగా కులాంతర, మతాంతర, వరకట్న వ్యతిరేక ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి పురస్కారాలు అందజేస్తామని ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు ఈఎస్ఎస్ నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్ఫూర్తిదాయకమైన వివాహాలు చేసుకున్న 60 జంటలకు ఆగస్టు 11వ తేదీన ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు. ఆదర్శ అవార్డుల కోసం అర్హులైన వారు ఆగస్టు 5వ తేదీ లోపు తమ దరఖాస్తులను వాట్సాప్ నంబర్ 9652347207కు పంపాలని సూచించారు.

నేడు బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

అనంతపురం కల్చరల్: ఎఫ్ఓబీఎంఐఎస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం అనంత వేదికగా రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం ప్రతినిధి ఏఎల్ఎన్ శాస్త్రి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే మెగా వధూవరుల పరిచయ వేదికకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వధూవరులు తరలి వస్తారని పేర్కొన్నారు. బ్రాహ్మణ కుటుంబాలు శాఖాబేధాలు మరచి సహకారం అందించాలని కోరారు. ఉచిత రిజిస్ట్రేషన్ అక్కడే చేయించుకోవచ్చని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఈనెల 23వ తేది నుంచి 27వ తేదీ వరకు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న తోపుదుర్తి, పి.యాలేరు, పి.సిద్ధరాంపురం, 24న మదిగుబ్బ, బి.యాలేరు, పి.యాలేరు, పి.సిద్దరాంపురం, 25న మదిగుబ్బ, పి.యాలేరు, ఆత్మకూరు, 26న సనప, రంగంపేట, ఆత్మకూరు, 27న సనప, రంగంపేట, పంపనూరు, సింగంపల్లి, సింగంపల్లి తండా గ్రామాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

రామగిరి: మండలంలోని పేరూరులో మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య పానకాల కుండలను తలపై పెట్టుకుని పీర్ల మసీదు వద్దకు తీసుకెళ్లారు. పీర్ల మసీదులో చక్కెర చదివింపులు చేయించారు. పీర్లను దర్శించుకునేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెట్లను కొట్టి ఎద్దులు, ట్రాక్టర్ ద్వారా గుండంలోకి వేశారు.

నేత్రపర్వం.. సాయినాథుడి నగరోత్సవం



వేణుగోపాల నగర్‌లో పూజలందుకున్న సాయినాథుడు

అనంతపురం కల్చరల్: స్థానిక వేమన టెలిఫోన్ ఎదురుగా కొలువైన షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం రాత్రి సాంస్కృతిక ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. శాస్త్రీయ నృత్యాలతో సాయినాథుడికి నీరాజనాలర్పించారు. ఇటీవల జాతీయ స్థాయిలో నాట్యమయూరిగా పేరొందిన హరితను నాట్య ప్రదర్శన అనంతరం ఘనంగా సత్కరించారు. వేణుగోపాల్ నగర్ షిరిడి సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో నగరవీధుల్లో సాగిన కళాజాత ఆకట్టుకుంది. శ్రీ సద్గురు సాయినాథ్ సేవా సమితి వారు భారీ రథోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ దీపకాంతుల నడుమ రథం ముందు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు వివిధ దేవతల రూపాల వేషధారణలతో అలరించారు. సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పూలరథంపై బాబా ఊరేగుతున్నప్పుడు భక్తులు అడుగడుగున హారతులు పట్టారు.



డ్రమ్స్ వాయిస్తున్న కళాకారులు



తలపై కలశాలతో మహిళల సందడి



చెరువుకట్ట బాబా మందిరం వద్ద కోలాటం